సాక్షి నల్లగొండ

మంగళవారం ⋅ 10 ⋅ జనవరి ⋅ 2023



అంధ విద్యార్థుల ధర్నా
నల్లగొండలోని అంధుల పాఠశాలను కొనసాగించాలని అంధ విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. - 10లో



కనీస వేతనం అమలు చేయాలి
మిషన్ భగీరథలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం 29.0°/13°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ట్యూటర్ల నియామకానికి గ్రీన్ సిగ్నల్

నల్లగొండ టౌన్ : నల్లగొండ, సూర్యాపేట ప్రభుత్వం మెడికల్ కళాశాలల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిని ట్యూటర్ల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నల్లగొండ మెడికల్ కాలేజీలో 18 మందిని, సూర్యాపేట మెడికల్ కాలేజీలో 18 మంది ట్యూటర్ల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. వీరికినెలకు రూ.57,700 గౌరవ వేతనం చెల్లించనున్నారు.

పార్ట్-బీ భూములకు పాస్‌పుస్తకాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

మిర్యాలగూడ : పార్ట్-బీలోని ప్రభుత్వ భూముల రైతులకు వెంటనే పాస్ పుస్తకాలు అందించాలని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ దామరచర్ల మండలంలోని అనేక గ్రామాల్లోని రైతులు పార్ట్-బీలోని ప్రభుత్వ భూముల్లో ఎన్నో ఏండ్లుగా సాగు చేసుకుంటుండగా పాస్ పుస్తకాలు లేకపోవడంతో ప్రభుత్వం అందించే రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు వర్తించడంలేదని అన్నారు. దీంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పార్ట్- బీలో ఉన్న భూముల్లోని అర్హులైన ప్రతి ఒక్కరికి పాస్ పుస్తకాలు అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బంటు కిరణ్, చల్లా అంజిరెడ్డి, రమావత్ బాలునాయక్, జనార్దన్, గాజుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

నార్కట్‌పల్లి : ప్రభుత్వం పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ భిక్షపతి కోరారు. సోమవారం మండలంలోని ఎల్లారెడ్డిగూడెం హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం కొనసాగుతున్న ప్రత్యేక తరగతులను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

నల్లగొండ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో వేడుకలను కనులపండువగా నిర్వహించారు. చిన్నికృష్ణుడిని ఊయలలో వేసి, జోలపాటలు, కీర్తనలు పాడి వెన్నెముద్దల ఆరగింపజేశారు. అనంతరం భజనలు, నృత్యాలు చేశారు.

కల్తీ మద్యాన్ని నిరోధించాలి



వినతిపత్రం ఇస్తున్న పీఆర్‌పీఎస్ నాయకులు

నల్లగొండ క్రైం : మద్యం షాపుల్లో కల్తీ మద్యం విక్రయాలను నిరోధించాలని పీఆర్‌పీఎస్ నాయకులు సోమవారం జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలోని అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నూనె వెంకటస్వామి మాట్లాడుతూ ఆదాయం కోసం గ్రామాల్లో బెల్టు షాపులు ఏర్పాటు చేయడంతో చీకటి పడితే మహిళలు తిరగలేని పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో దేప శ్రీనివాస్‌రెడ్డి, నజీరుద్దీన్, నరేష్, చంద్రయ్య, సైదులు తదితరులు ఉన్నారు.

● ఆందోళన



కట్టంగూరు మండలం పిట్టంపల్లి నుంచి మర్రిగూడ బైపాస్ వరకు డబుల్ రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ పిట్టంపల్లి నుంచి పాదయాత్రగా తరలివచ్చి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

● ఆట



నకిరేకల్‌లో నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలల నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీల్లో తలపడుతున్న ఓగోడు, మునిపంపుల బాలికల జట్లు

వణికిస్తున్న చలి

- రెండు రోజుల నుంచి పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రతలు

నల్లగొండ : రెండు రోజుల నుంచి చలి తీవ్రత పెరిగింది. రాత్రి ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో పడిపోవడంతోపాటు పగటి పూట చల్లటి గాలులు వీస్తున్నాయి. దీంతో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆదివారం ఉదయం 5 గంటలకు ఉష్ణోగ్రత 11.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కాగా, సోమవారం ఉదయం 6 గంటలకు 11.7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. చలి తీవ్రత మరింత పెరగడంతోపాటు చల్లటి గాలులు వీస్తుండడంతో ప్రజలు పెద్దగా బయటికి రావడం లేదు. రాత్రి 7 దాటితే రోడ్లపై పెద్దగా తిరగడంలేదు. చలి తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు.

దళితబంధు వెలుగులు



డిండి మండలం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన జంతిక రామకృష్ణ, ఎలిమినేటి లక్ష్మమ్మ, ఎలిమినేటి కలమ్మ, పాలె శాంతమ్మ నలుగురు దళితబంధు కింద లబ్ధిపొందారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.40 లక్షలతో హైదరాబాద్‌లోని అల్మాస్‌గూడలో సూపర్ మార్కెట్ ఏర్పాటు చేశారు. ప్రతిరోజు రూ.35 వేల వరకు వ్యాపారం సాగుతోంది. అంతా ఒకే గ్రామానికి చెందిన వారు ఉమ్మడిగా సూపర్‌మార్కెట్ ఏర్పాటు చేయడంతో మంచి లాభం పొందుతున్నారు. ఆ నలుగురు షాపులో పని చేయడంతో పాటు మరో 8 మందికి పని కల్పించారు.



ఈయన పేరు వర్కాల మల్లయ్య. నార్కట్‌పల్లి మండలం బాజాకుంట. ఒకప్పుడు వ్యవసాయ కూలీ. రోజూ పని చేస్తేనే కుటుంబం గడిచేది. దళిత బంధు పథకం కింద డ్రోన్ స్ప్రేయర్ యూనిట్ ఏర్పాటు చేసుకున్నాడు. ఆయన ఇప్పుడు నెలకు రూ. 20 వేలు సంపాదిస్తున్నారు.

లబ్ధిదారుల జీవనంలో కనిపిస్తున్న మార్పు

- 517 మంది దళితులకు మొదటి దశ యూనిట్లు మంజూరు
- ఒక్కో యూనిట్ రూ.10 లక్షలతో ఏర్పాటు
- మిర్యాలగూడ మినహా మిగతా నియోజకవర్గాల్లో 417 యూనిట్లు ప్రారంభం
- వ్యాపారాలతో మరో నలుగురికి ఉపాధి కల్పన



దళితబంధు కింద మంజూరైన కిరాణం షాపును పరిశీలిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్

సాక్షి ప్రతినిధి నల్లగొండ: ప్రభుత్వం అమలు చేస్తున్న దళిత బంధు పథకం దళితుల కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో దళితులు వ్యక్తులుగా, సమూహంగా ఏర్పడి పెద్ద వ్యాపారాలు చేసుకునే అవకాశం వచ్చింది. ఈ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులు జిల్లాలో ట్రాన్స్‌పోర్ట్, నాన్ ట్రాన్స్‌పోర్ట్ రంగాల్లో వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా వృద్ధి చెందుతున్నారు. వారే కాదు వారితోపాటు మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగారు.

517 యూనిట్లు మంజూరు

దళిత కుటుంబాలు ఆర్థిక స్వావలంబనను సాధించాలన్న లక్ష్యంతో, వారికి చేయూతను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. మొదటి విడతగా నల్లగొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండలో నియోజకవర్గానికి వంద చొప్పున 400 యూనిట్లు, నకిరేకల్‌లో జిల్లా పరిధిలోకి వచ్చే మండలాల్లో 61, మునుగోడులో 39, శాలిగౌరారంలో 17 యూనిట్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి పథకాన్ని మంజూరు చేసింది. అందులో ఒక్క మిర్యాలగూడ నియోజకవర్గం మినహా మిగతా నియోజకవర్గాల్లో 417 యూనిట్లు గతేడాది ఆగస్టు నాటికే ప్రారంభమయ్యాయి. అవి ఇప్పుడు విజయవంతంగా కొనసాగుతుండటంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ట్రాన్స్‌పోర్ట్, నాన్ ట్రాన్స్‌పోర్ట్ పథకాలు

జిల్లాలో దళితబంధు కింద 372 ట్రాన్స్‌పోర్ట్ వాహనాల యూనిట్లను మంజూరు చేశారు. మరో 145 మందికి నాన్ ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారాలకు రుణాలు అందించారు. ట్రాన్స్ పోర్ట్‌లో కార్లు, డీసీఎం, ఇతర వాహనాలు మంజూరు చేయగా, నాన్ ట్రాన్స్‌పోర్ట్ కేటగిరీలో సూపర్ మార్కెట్లు, డెయిరీ ఫామ్‌లు, ఫౌల్ట్రీ షెడ్లు, గొర్రెలు, బట్టల షాపులు, ఫొటో స్టూడియోలు, ఎలక్ట్రానిక్ షాపులు, పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్లు, వరికోత యంత్రాలు తీసుకున్నారు. పథకంతో లబ్ధిపొందిన వారు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

దళితబంధు రక్షానిధి సైతం..

ప్రతి లబ్ధిదారులు రూ.10 వేలు దళిత బంధు రక్షా నిధి చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వం మరో రూ.10 వేలు ఒక్కో లబ్ధిదారుని పేరును చెల్లించనుంది. ఆ డబ్బును నిధిలో జమ చేయనుంది. ఎవరైనా లబ్ధిదారుడికి ఏదైనా ప్రమాదం జరిగితే వారి కుటుంబానికి ఈ రక్షా నిధి నుంచి ఆర్థిక సహాయం అందించేలా చర్యలు చేపట్టింది.

రోజుకు రూ.1000 వస్తున్నాయి



మాది నల్లగొండ మండలం రాముల బండ గ్రామం. టీవీ మెకానిక్‌ని. దళిత బంధు ద్వారా టీవీ, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల షాపు పెట్టుకున్నాను. షాపు ద్వారా ఇప్పుడు రోజుకు రూ.1000 వస్తోంది. మెకానిక్ పని ద్వారా మరో రూ.1000 సంపాదిస్తున్నాను. నాకున్న ఇబ్బందులు తొలగిపోయాయి.

– గాలి జయరాం

ఆర్థికంగా నిలదొక్కుకున్నా



మాది నల్లగొండ మండలం రాముల బండ. ఒకప్పుడు సూపర్‌మార్కెట్‌లో పనిచేసే వాడిని పనికి వెళ్తేనే ఆ రోజు గడిచేది. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. దళితబంధు కింద రూ.9.90 లక్షలు పొందాను. నల్లగొండలోని దేవరకొండ రోడ్డులో సూపర్ మార్కెట్ ఏర్పాటు చేసుకున్నారు. నేను నా భార్య షాపులో పని చేస్తున్నాం. రోజుకు రూ.10 వేల చొప్పున నెలకు రూ.3 లక్షల వ్యాపారం అవుతోంది. అందులో రూ.60 వేల వరకు మిగులుతోంది. ప్రభుత్వం చేయూతతో మా జీవితాలకు మేలు చేకూరింది.

– నామ రాములు, రాముల బండ

దళితుల జీవితాల్లో మార్పు వచ్చింది



దళిత బంధు యూనిట్లతో దళితుల జీవితాల్లో మార్పు వస్తోంది. ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఉమ్మడిగా ఏర్పాటు చేసే యూనిట్ల కింద వారు అభివృద్ధి చెందడంతోపాటు మరో నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతున్నారు. బాగా వ్యాపారం చేసుకుంటే మరింత వృద్ధిలోకి వస్తారు.

– శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్



ప్రజావాణికి తరలివచ్చిన ఫిర్యాదుదారులు

నల్లగొండ : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన.. అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుతో కలసి ప్రజలను అర్జీలను స్వీకరించారు. నల్లగొండ మండలంలో భూదాన్ భూముల్లో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, బధిరుల పాఠశాలను వేరేచోటకు మార్చ వద్దని, గిరిజన సంక్షేమ శాఖలో దినసరి వేతనంపై పనిచేసే వర్కర్లు తన వేతనాలు హాస్టల్ వార్డెన్ల ద్వారా కాకుండా.. జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ద్వారా అందేలా చూడాలని.. తదితర సమసపై 42 ఫిర్యాదులు అందాయి. వాటని పరిశీలించిన కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులను తిరస్కరించిన పక్షంలో అందుకు గల కారణాలను అర్జిదారుడికి తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేఎఫ్‌సీలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని కేఎఫ్‌సీలో ఫుడ్ సేఫ్టీ అధికారులు సోమవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. కల్తీ నూనెతో వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేసి, రసాయనాలు కలిపి ప్రజలకు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో యాదాద్రి జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. అనుమానిత శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

బాల కార్మికులకు విద్య అందేలా చర్యలు



ఇటుక బట్టీ వద్ద కార్మికుల పిల్లలతో మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారులు

మిర్యాలగూడ : ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న వలస కార్మికుల పిల్లలను పాఠశాలలకు పంపే బాధ్యత బట్టీల యాజమాన్యానిదేనని సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు రామచంద్రయ్య, వంగూరి వీరయ్య పేర్కొన్నారు. సోమవారం మిర్యాలగూడ మండలంలోని గూడూరు, కొత్తగూడెం గ్రామాల సమీపంలో ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న ఒడిశా వలస కార్మికుల పిల్లలను కలిసి వారంతా బట్టీల వద్దనే చదువుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ఒడిశా నుంచి వచ్చిన విద్యావంతుడిని వలంటీర్‌గా నియమించి మధ్యాహ్న భోజనం, పుస్తకాలు అందించేలా ఏర్పాటు చేశారు. బడిబయట పిల్లల సర్వేలో భాగంగా బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. వారి వెంట ఎంఈఓ బాలాజీనాయక్, సీఆర్‌పీ శ్రీనివాసచారి, ఇటుకబట్టీల యజమానులు రమణయ్య, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే సహించం

- అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

నల్లగొండ : బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టంపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటుక బట్టీల యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బట్టీల వద్ద ఉండే గర్భిణులు, ఆరేళ్లలోపు పిల్లలకు దగ్గర ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందించాలన్నారు. జిల్లాలో ఇటుక బట్టీల్లో పనిచేసే వలస కార్మికుల జాబితా సేకరించి 15 రోజుల్లో సమర్పించాలని కార్మిక శాఖ ఉప కమిషనర్‌ను ఆదేశించారు. వలస కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు జీరో బ్యాలెన్స్ ఖాతాలు తెరవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు సూచించారు. బాల కార్మికులను గుర్తించేందుకు పోలీస్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖల ఆధ్వర్యంలో ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. రేషన్ పంపిణీ చేసేందుకు అర్హులైన జాబితా 15 రోజుల్లో సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ రాజేంద్ర ప్రసాద్, బాలల సంరక్షణ అధికారి గణేష్, మిషన్ భగీరథ ఈఈ ముజీబుద్దీన్, డీపీఓ విష్ణువర్ధన్, లీడ్ మేనేజర్ శ్రామిక్, డీపీఆర్‌ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాన్ మస్టర్ రోల్ వర్కర్ల వేతనాలపై సమావేశం

నల్లగొండ : నాన్ మస్టర్ రోల్ వర్కర్లకు 2022 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు చెల్లించాల్సిన వేతనాలపై కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులతో సమావేశమయ్యారు. ఆయా శాఖల్లో పనిచేస్తున్న మస్టర్ రోల్ వర్కర్ల నైపుణ్యం, అర్ధ నైపుణ్యం, నైపుణ్యం లేని, పార్ట్ టైం వర్కర్ల వేతనాలపై చర్చించారు. సమావేశంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ రాజేంద్రప్రసాద్, గృహనిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, డీపీఓ విష్ణువర్ధన్, వ్యవసాయ శాఖ ఏడీ హుస్సేన్‌బాబు, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారిణి సల్మాబాను, బీసీ సంక్షేమ శాఖ అధికారిణి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

బడ్డీ యాప్‌పై కొరవడిన అవగాహన

- వినియోగించుకోని ప్రజలు
- ప్రచారం కల్పించడంలో అధికారులు వైఫల్యం
- యాప్ ద్వారా పట్టణాల్లో పారదర్శకంగా అందనున్న సేవలు



దేవరకొండ : మున్సిపాలిటీల్లో మెరుగైన సేవలు అందించడంతో పాటు అక్రమాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ సిటిజన్ బడ్డీ యాప్‌పై పట్టణ వాసులకు అవగాహన కొరవడింది. ఈ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించడంలో మున్సిపల్ యంత్రాంగం విఫలం కావడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. మున్సిపాలిటీల సమగ్ర వివరాలు ఇంటి నుంచే తెలుసుకునేందుకే రూపొందించిన ఈ యాప్ ఉన్న సంగతి కూడా 50 శాతం ప్రజలకు తెలియదు. ప్రజలకు అవగాహన కల్పించి ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం వల్ల మున్సిపాలిటీల్లో పారదర్శకతతో కూడిన సేవలు ప్రజలకు అందనున్నాయి.

యాప్ పనితీరు ఇలా..

సిటిజన్ బడ్డీ యాప్‌ను స్మార్ట్ ఫోన్లలో ప్లే స్టోర్ నుంచి ఇన్‌స్టాల్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేసి జిల్లా పేరును క్లిక్ చేయగానే మున్సిపాలిటీ పేరు అడుగుతుంది. మున్సిపాలిటీ పేరు నమోదు చేయగానే సంబంధిత మున్సిపాలిటీ సమగ్ర వివరాలు ఉంటాయి. మున్సిపాలిటీలో ఆస్తి పన్ను చెల్లింపు, ఫిర్యాదులు, పౌర సేవలు, అధికారుల వివరాలు, నీటి సరఫరా, ఇతర దరఖాస్తు పత్రాలు, సిబ్బంది జాబితా, ముఖ్యమైన నంబర్లు, సంప్రదింపులతో పాటు పలు అంశాలు స్క్రీన్‌పై కనిపిస్తాయి. వీటిలో తమకు అవసరమైన వాటిని క్లిక్ చేసి ఇంటి నుంచే పనులు పూర్తి చేసుకోవచ్చు. రాష్ట్రంలోని ఏ మున్సిపాలిటీ వివరాలు అయినా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. మున్సిపాలిటీ ఎప్పుడు ఏర్పడింది. ఎప్పుడు అప్‌గ్రేడ్ అయ్యిందన్న వివరాలు సైతం ఈ యాప్‌లో ఉంటాయి. మున్సిపాలిటీ పాలకవర్గం ఫోన్ నంబర్లు అలాగే ఇంజనీరింగ్, రెవెన్యూ, పారిశుద్ధ్య, పట్టణ ప్రణాళిక, ఎలక్ట్రికల్ తదితర విభాగాలకు సంబంధించిన అధికారుల పేర్లు, ఫోన్ నంబర్ వివరాలు సైతం ఉంటాయి.

ఆన్‌లైన్‌లో ఫిర్యాదుకు అవకాశం

ఈ యాప్ ద్వారా మెరుగైన సేవలు పొందడమే కాక సమస్యలపై ఫిర్యాదులు సైతం చేసే అవకాశం ఉంది. ఫిర్యాదు చేసేందుకు ఎంట్రీ ఇస్తే అందులో డ్రెయినేజీ, రోడ్లు తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, అక్రమ కట్టడాలు తదితర అంశాలు వస్తాయి. సంబంధిత అంశాన్ని ఎంపిక చేసుకొని దానిలో ఫిర్యాదుదారుడి పేరు, ఫోన్ నంబర్, అడ్రస్, సమస్య, సంబంధిత ప్రాంతం ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ సమస్యపై అధికారులు తీసుకున్న చర్యలను యాప్‌లో పొందుపర్చుతారు. దీని ద్వారా ఎలాంటి పైరవీలకు తావు లేకుండానే సమస్య పరిష్కారమవుతుంది.

అవగాహన కల్పించాలి



బడ్డీ యాప్ విషయమై ప్రజలకు సరైన అవగాహన కల్పిస్తే మున్సిపాలిటీ ద్వారా మెరుగైన సేవలు పొందవచ్చు. ప్రస్తుత తరుణంలో ప్రతి ఇంట్లో స్మార్ట్ ఫోన్ అందుబాటులో ఉంది. నేరుగా అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లే అవకాశం ఉండడంతో ఫిర్యాదులకు త్వరగా పరిష్కారం లభిస్తుంది. ముఖ్యంగా విద్యావేత్తలు, యువత మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించే అవకాశం ఉంటుంది.

– అజయ్, దేవరకొండ

యాప్ సేవలను వినియోగించుకోవాలి

సిటిజన్ బడ్డీ యాప్ ద్వారా అందిస్తున్న సేవలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే పలుమార్లు నిర్వహించిన సమావేశాల్లో బడ్డీ యాప్‌పై అవగాహన కల్పించాం. దేవరకొండ మున్సిపాలిటీకి సంబంధించి ఇప్పటికే సిటిజన్ బడ్డీ యాప్‌లో వివరాలు నమోదు చేశాం. మహిళా సంఘాల సభ్యులు, మెప్మా ఆర్పీలకు సైతం యాప్‌పై అవగాహన కల్పించి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాం. మరికొంత మంది యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నప్పటికీ సేవలను పొందడం లేదు.

– వెంకటయ్య, కమిషనర్, దేవరకొండ

క్లుప్తంగా

'యాదాద్రి'లో ఆక్టోపస్ బలగాల మాక్ డ్రిల్


మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ సిబ్బంది

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేసే దిశగా పోలీసు శాఖ అధికారులు ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి 10గంటల తర్వాత ఆక్టోపస్ బలగాలు ఆలయానికి చేరుకుని మాక్ డ్రిల్ చేపట్టారు. రాత్రి 10గంటల నుంచి అర్ధరాత్రి 12గంటల వరకు ఈ మాక్‌డ్రిల్ కొనసాగింది. ఆలయంలో అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై ఆక్టోపస్ బలగాలు స్థానిక అధికారులతో చర్చించారు.

గుంటుకగూడెం తాత్కాలిక సర్పంచ్‌గా శంకరయ్య


తాత్కాలిక సర్పంచ్‌గా శంకరయ్య ఎన్నికైనట్లు ప్రకటిస్తున్న ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్

నిడమనూరు: మండలంలోని గుంటుకగూడెం తాత్కాలిక సర్పంచ్‌గా నాల్గో వార్డు సభ్యుడు శంకరయ్య ఎన్నికయ్యారు. గతంలో సర్పంచ్‌గా పనిచేసిన గన్నెపాక స్వామి ఎన్నికైన ఎనిమిది నెలలకే మృతిచెందాడు. దీంతో ఉప సర్పంచ్ అక్కి సరితను తాత్కాలిక సర్పంచ్‌గా నియమించారు. అయితే అక్కి సరితపై వార్డు సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి పదవి నుంచి దించారు. ఈ క్రమంలో సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులు ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహించగా, నాల్గో వార్డు సభ్యుడు గుడిసె శంకరయ్యను ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. దీంతో ఆయనే తాత్కాలిక సర్పంచ్‌గా వ్యవహరించనున్నారు. చెక్ పవర్‌పై సంతకం కోసం సీనియర్ వార్డు సభ్యుడు ప్రవీణ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, ఎంపీఓ రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే టికెట్ ఇవ్వాలి

అడ్డగూడూరు: వచ్చే ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ టికెట్‌ను స్థానికులకే ఇవ్వాలని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ మందుల సామేల్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో తాను తుంగతుర్తి నియోజకవర్గ టీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జిగా ఉండి ప్రతి గ్రామంలో ఉద్యమాన్ని ముందుండి నడిపించినట్లు తెలిపారు. తన పనితనాన్ని గుర్తించి సీఎం కేసీఆర్ 2016లో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించారని అన్నారు. రైతాంగ అభివృద్ధి కోసం తన సొంత మండలం అడ్డగూడూరులోని చౌల్ల రామారం గ్రామశివారులో గల ప్రభుత్వ భూమిలో 15 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల గోదాంలను మంజూరు చేయించి 2020 జూలై 12న శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌ను ఆహ్వానించినా వారు రాలేదని అన్నారు. కానీ ఆదివారం నిర్వహించిన గోదాంల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ చైర్మన్‌నైన తనను ఆహ్వానించకుండా అవమానపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని, వచ్చే ఎన్నికల్లో తనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరనున్నట్లు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులకు అండగా ఉంటా

- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


డైరీ ఆవిష్కరిస్తున్న యాదాద్రి డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, బీర్ల అయిలయ్య, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

భువనగిరి: విద్యుత్ ఉద్యోగులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరి పట్టణంలోని సాయి కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 327, ఐఎన్‌టీయూసీ డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు విద్యుత్ ఉద్యోగులు ముందంజలో ఉంటారన్నారు. అనంతరం తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ యూనియన్-327 అధ్యక్షుడు, ఆలిండియా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు డాక్టర్ జి. సంజీవరెడ్డి, ఎస్పీడీసీఎల్ సీఎండీ జి. రఘుమారెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ మంత్రితో సంప్రదించి 2022లో ఇవ్వాల్సిన పీఆర్సీ విషయంలో నిర్ణయం తీసుకునే విధంగా కృషిచేస్తామన్నారు. బొగ్గు ధర, రవాణా ఖర్చులు పెరిగి సంస్థపై భారం పడటం వల్ల వేతనాలు చెల్లింపులో జాప్యం జరుగుతుందని చెప్పారు. భూగర్భ జలాలు పెరగడం వల్ల వ్యవసాయంలో సాగు విస్తీర్ణం పెరగడంతో విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. సంస్థలో వచ్చే ప్రతి సమస్యకు కార్మికులు కారణం కాదని యాజమాన్యం తీసుకునే నిర్ణయాల వల్లనే వస్తుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సంస్థకు ముఖ్యమని వారికి సేవలందించడంతో ఉద్యోగులు ముందుండాలని అన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన నాసా విధానం వల్ల సంస్థకు రూ.కోటి ఆదాయం వచ్చిందన్నారు. అనంతరం డైరీని ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బీర్ల అయిలయ్య, ఇనుగుల శ్రీధర్, సురేష్ కుమార్, భూపాల్‌రెడ్డి, ఎస్‌ఈ శ్రీనాథ్, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, ఐలయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సతీష్, కార్యదర్శులు నర్సింగ్‌రావు, బండారు శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో పత్తి రైతు ఆత్మహత్య


ఉరి వేసుకున్న శేఖర్‌రెడ్డి

శాలిగౌరారం : కాలం కలిసిరాలేదు.. వాతావరణం అనుకూలించలేదు.. పత్తిపంట సాగు చేసిన ఓ రైతు దిగుబడులు రాక పంట సాగుకోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక పంటచేనులో చెట్టుకు ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారంలో ఆదివారం జరుగగా సోమవారం వెలుగులోకి వచ్చింది. అందుకు సంబంధించి బాధిత కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెర్కకొండారం గ్రామానికి చెందిన కాసర్ల శేఖర్‌రెడ్డి(65) తనకున్న మూడెకరాల భూమితో పాటు గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద ఐదెకరాల భూమి కౌలుకు తీసుకొని పత్తిపంటను సాగుచేశాడు. పంటసాగు కోసం బంధువులు, గ్రామస్తుల వద్ద సుమారు రూ.10 లక్షలు అప్పులు చేశాడు. అధిక వర్షాల వల్ల పంట పూర్తిగా దెబ్బతినడంతో దిగుబడి రాలేదు. దీంతో పంటసాగుకోసం చేసిన అప్పులు తీర్చేందుకు తరచూ మనోవేదనకు గురవుతుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం తన బంధువుల ఊరికి వెళ్లొస్తానని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరాడు. గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమిలో చెట్టుకు విద్యుత్ కేబుల్‌వైర్‌తో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన మృతుడి అన్న కొడుకు కాసర్ల రవీందర్‌రెడ్డి తన బాబాయి శేఖర్‌రెడ్డి మృతిచెంది చెట్టుకు వేలాడుతూ కనిపించడంతో కుటుంబీకులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించాడు. మృతుడి కుమారుడు కాసర్ల వేణుగోపాల్‌రెడ్డి సోమవారం ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నకిరేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి జైలుశిక్ష


నిందితులు పూలమ్మ, స్వామి, నవీన్

అడ్డగూడూరు: హత్యాయత్నం కేసులో మండల పరిధిలోని డి.రేపాక గ్రామానికి చెందిన ముగ్గురికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ భువనగిరి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి సోమవారం తీర్పునిచ్చారు. ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. భూవివాదంలో భాగంగా 2014 సంవత్సరంలో డి.రేపాక గ్రామానికి చెందిన గ్యార స్వామి, గ్యార పూలమ్మ, సూరారం నవీన్ కలిసి అదే గ్రామానికి చెందిన గ్యార స్వరూప మీద కత్తితో దాడి చేసి గాయపర్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి పోలీసులు కేసు నమోదు చేశారు. భువనగిరి అసిస్టెంట్ స్పెషన్స్ కోర్టులో సోమవారం ఈ కేసు తుది విచారణ జరగ్గా ముగ్గురిపై నేరం రుజువు కావడంతో వారికి 5సంవత్సరాల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు. దీంతో ముగ్గురు నిందితులను జైలుకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వానికి సీఎంఆర్ ఇవ్వకుండా మోసం

- రైస్‌మిల్లు యజమానుల రిమాండ్

మిర్యాలగూడ టౌన్: ప్రభుత్వానికి కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ఇవ్వకుండా మోసం చేసిన కేసులో మిర్యాలగూడ మండలంలోని వజ్ర రైస్‌మిల్లు యాజమానులను రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం మిర్యాలగూడ కోర్టులో హాజరుపర్చగా వారిని 14 రోజుల పాటు రిమాండ్‌కు తరలించాలని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి తీర్పునిచ్చారు. రూరల్ సీఐ ముత్తినేని సత్యనారాయణ, ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. 2020-21 రబీ సీజన్‌కు గాను ధాన్యాన్ని సీఎంఆర్ చేసి ఎఫ్‌సీఐకి పంపే విధంగా తెలంగాణ సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్ వారు మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లికి చెందిన వజ్ర రైస్ మిల్లుకు రూ.7.89 కోట్ల విలువ చేసే 4339.960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అప్పగించారు. కానీ వజ్ర రైస్ మిల్లు యాజమాన్యం సీఎంఆర్ ఇవ్వకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్‌ఆర్ యాక్ట్‌ను అమలు చేశారు. ఈ మేరకు నిల్వ ఉన్న ధాన్యాన్ని వేలం వేయడంతో రూ.కోటి ప్రభుత్వం దక్కించుకోగా, సుమారు రూ.5.90 కోట్ల వరకు వజ్ర రైస్ మిల్లు వారు సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్ వారికి ఇవ్వాల్సి ఉంది. కానీ ఉద్దేశపూర్వకంగానే సీఎంఆర్ చేయకుండా ప్రభుత్వాన్ని మోసం చేసినందుకు ఈ విషయంపై సివిల్ సప్లయ్ అధికారులు మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో గతేడాది అక్టోబర్‌లో వజ్ర రైస్ మిల్లు మేనేజింగ్ డైరెక్టర్ వజ్ర అపర్ణ, వజ్రపు అనురామ్, సత్యనారాయణపై కేసు నమోదు చేశారు. వీరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్‌ఐ తెలిపారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ రైల్వే స్టేషన్ పరిధిలో రైలు పట్టాలపై ఆదివారం రాత్రి గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు రైల్వే ఎస్‌ఐ పవన్‌కుమార్ రెడ్డి తెలిపారు. రైల్వే సిబ్బంది సమాచారం మేరకు మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించామని, మృతదేహం గుర్తుపట్టలేనంతగా చిధ్రమైందని, మృతుడి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


రమావత్ గంగ్యా (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు జారిపడి తీవ్ర గాయాలపాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. రైల్వే ఎస్‌ఐ పవన్‌కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం ట్యాంకుతండాకు చెందిన రమావత్ గంగ్యా(48) యాదాద్రి జిల్లా వలిగొండ ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం అతడు వలిగొండకు వెళ్లి శబరి ఎక్స్‌ప్రెస్ రైలులో మిర్యాలగూడకు తిరిగి వస్తున్నాడు. మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు దిగుతూ జారిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. రైలు డ్రైవర్ సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు వెంటనే అక్కడకు చేరకుని అతడిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే జీఆర్‌పీ పోలీసులు పేర్కొన్నారు.

కరెంట్ హీటర్ తగిలి మహిళ మృతి


ఆమని (ఫైల్)

సూర్యాపేట క్రైం: కరెంట్ హీటర్ తగిలి మహిళ మృతిచెందిన ఘటన సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు.. సూర్యాపేట పట్టణంలోని గొల్లబజార్ 39వ వార్డులో నివాసముంటున్న టింగిల్‌కార్ ఆమని(27) ఇంట్లో కరెంట్ హీటర్ పెట్టబోయి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. మృతదేహానికి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూల్‌డ్రింక్ షాపులో చోరీ

నాగారం: గుర్తుతెలియని వ్యక్తులు కూల్‌డ్రింక్ షాపులో చోరీకి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి నాగారం బంగ్లా వద్ద చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం గ్రామానికి చెందిన కన్నెబోయిన అనిల్ వర్ధమానుకోటకు వెళ్లేదారిలో వైన్స్ ఎదురుగా కూల్‌డ్రింక్ షాపును నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగా ఆదివారం రాత్రి 10గంటల తర్వాత దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు షాపు పైకప్పు రేకులను తొలగించి లోపలకు చొరబడి రూ.20వేల నగదుతో పాటు కూల్‌డ్రింక్స్ ఎత్తుకెళ్లారు. అదేవిధంగా ఎదురుగా ఉన్న రెడ్డి దాబాలో రెండు సిలిండర్లను చోరీ చేసినట్లు దాబా యజమాని రవీందర్‌రెడ్డి తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు అనిల్, రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు.

గౌడ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఆత్మకూరు(ఎస్)(సూర్యాపేట): మండల పరిధిలోని ఏనుబాముల గౌడ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, ఏనుబాముల గౌడ సంఘం అధ్యక్షుడు పసునూరి తిరుమలేష్, నాయకులు గిలకత్తుల సర్వయ్య గౌడ్, పసునూరి లక్ష్మయ్య, వత్సవాయి శ్రీరాములు, తండు అంజయ్య, వత్సవాయి అయోధ్య, అండం నాగరాజు, పసునూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

అవంతీపురం గ్రామ సమస్యలు పరిష్కరించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి


ఖాళీ బిందెలతో ఆర్డీఓ కార్యాలయానికి పాదయాత్రగా వెళ్తున్న సీపీఎం నాయకులు, అవంతీపురం గ్రామస్తులు

మిర్యాలగూడ: మండలంలోని అవంతీపురం గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం గ్రామస్తులతో కలిసి అవంతీపురం నుంచి మిర్యాలగూడ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీరు, విద్యుత్ సమస్యలతో పాటు పక్కా ఇళ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవంతీపురం కొత్త కాలనీలోని ప్రజలు విష సర్పాలతో సహజీవనం చేస్తూ వాటికి బలైపోతున్నారని అన్నారు. అధికారులు స్పందించి గ్రామంలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు పాదూరి శశిధర్‌రెడ్డి, అయూబ్‌ఖాన్, పాదూరి గోవర్ధని, ఉర్మిళ, లింగయ్య, కుందుకూరు రమేష్‌బాబు, పిల్లుట్ల సైదులు, గోవిందరెడ్డి, రామకృష్ణ, కోటయ్య, వెంకన్న, మోతె సైదులు, శివ, వెంకన్న, జ్యోతి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, మిషన్ భగీరథ కార్మికులు

నల్లగొండ: మిషన్ భగీరథలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లగొండ కలెక్టరేట్ ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ.. గత 16 సంవత్సరాలుగా గ్రామీణ నీటి సరఫరా విభాగంలో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న మిషన్ భగీరథలోకి మార్పు చేశారు తప్ప.. వారి జీవితాల్లో ఎలాంటి మార్పులు లేవని అన్నారు. ప్రతినెల మొదటి తేదీన వేతనాలు చెల్లిస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ నీటి మూటగానే మిగిలిందని ఆరోపించారు. ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సక్రమంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జంజరాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఎనిమిది గంటల పనివిధానాన్ని అమలు చేయాలని అన్నారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, యూనియన్ జిల్లా నాయకులు, గుర్రాము వెంకటేష్, కుర్తాల సైదులు, ఉయ్యాల మురళి, కర్నాటి వెంకన్న, ఉయ్యాల అంజనేయులు, దాసరి మల్లేష్, వేముల సైదులు, సింగం రమేష్, ఏర్పుల కృష్ణ, వేణునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నల్లతామర తెగులు గుర్తించి నిర్మూలించాలి


రావులపల్లిలో మిరప పంటను పరిశీలిస్తున్న సూర్యాపేట జిల్లా ఉద్యాన శాఖ అధికారి ప్రవంతి

తుంగతుర్తి: మిరప పంటను ఆశిస్తున్న నల్లతామర తెగులును మొదటి దశలోనే గుర్తించి నిర్మూలించాలని, మిరప సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని సూర్యాపేట జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రవంతి అన్నారు. మండల పరిధిలోని రావులపల్లిలో సాగుచేసిన మిరప పంటను సోమవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. నల్లతామర తెగులు నివారణకు లీటరు నీటికి 10వేల పీపీఎం వేపనూనె, 3మి.లీ కలిపి పిచికారీ చేయాలన్నారు. జీవ నియంత్రణ శిలీంద్రాలైన బవేరియా బాషియాన లేదా లెకానిశీలియం లేఖలి 5గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వేరు కుళ్లు నివారణతో పాటు ఇతర మిరప తోటలకు వచ్చే ముడత, పువ్వు రాలడం, పింద రాలడం వంటి వాటికి ఉద్యానవన శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించి మందులను పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాల బాట

- నాలుగెకరాల్లో జీరో బడ్జెట్‌తో వరి, కూరగాయలు, ఆకుకూరలు సాగు
- సహజ సిద్ధమైన కషాయాలు వాడుతూ ఆదర్శంగా నిలుస్తున్న వెంకటరెడ్డి, కవిత దంపతులు

పాడి పంట


తన వ్యవసాయ క్షేత్రంలో వెంకటరెడ్డి సాగుచేసిన దేశవాళీ వరి పంట

నడిగూడెం: ఎలాంటి పెట్టుబడి లేకుండా జీరో బడ్జెట్ విధానంలో గత 10 సంవత్సరాలుగా తనకున్న నాలుగు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ, పంట మార్పిడి విధానాన్ని పాటిస్తూ అధిక లాభాలు పొందుతున్నారు నడిగూడెం మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన నాగిరెడ్డి వెంకటరెడ్డి, కవిత దంపతులు. ప్రకృతి వ్యవసాయ పితామహుడు డాక్టర్ పాలేకర్ వద్ద రెండు సార్లు శిక్షణ పొంది రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా గోఆధారిత వ్యవసాయం చేస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వరి, వేరుశనగ, కంది, పెసర, పసుపు పంటతో పాటు కూరగాయలు, ఆకుకూరలు సహజ సిద్ధంగా పండిస్తున్నారు. భూసారం పెరిగేందుకు నవ ధాన్యాలు సాగు చేస్తున్నారు. అదేవిధంగా వీరికి అనారోగ్య సమస్యలు ఎదురైతే ఇంట్లోనే గోఆధారిత ఉత్పత్తులు వాడుతూ, రోగనిరోధక శక్తిని తట్టుకునే ఆహారం తింటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. అంతేకాకుండా వెంకటరెడ్డి పెంచుతున్న రెండు ఎద్దులు, నాలుగు ఆవులు, రెండు దూడలకు కూడా నాణ్యమైన గ్రాసం అందిస్తూ, ఎటువంటి యంత్రాలు వాడకుండా ఎద్దులు, ఆవులతోనే భూమి దున్ని పంటలు సాగు చేస్తున్నాడు. వ్యవసాయంలో వస్తు రవాణాకు ఎడ్లబండిని కూడా ఉపయోగిస్తున్నారు. తన పొలంలో పండిన పంటను చుట్టుపక్కల గ్రామాల వారికి అమ్ముతూ ఎటువంటి పెట్టుబడి లేకుండా లాభాలు ఆర్జిస్తున్నారు.

దేశవాళీ వరి రకాల సాగు..

వెంకటరెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో విత్తన అభివృద్ధి కోసం ఒక ఎకరంలో దేశీ వరి రకాలైన నవారా, చిట్టిముత్యాలు, సిద్ద సన్నాలు, రత్నచోడి, 83 మహారాజ్, మైసూరు మల్లిక, బాస్మతి తదితర రకాలు సాగు చేస్తూ ఆ విత్తనాలను చుట్టుపక్కల వారికి విక్రయిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నాడు.

చీడపీడల నివారణకు కషాయాల తయారీ

వివిధ రకాల కషాయాలను ఉపయోగించి పంటలకు ఆశిస్తున్న చీడపీడల నివారిస్తున్నారు. జీవామృతం, ఘన జీవామృతం, నీమాస్త్రం, అగ్నిహస్త్రం, దశపర్ణి, వేపగింజలు, భీజామృతం, మట్టిద్రావణం, బవేరియా బాసియానా, వర్టిసిల్లం, మెటారైజం తదితర ద్రావణాలు, పదార్థాలను సొంతంగా తయారు చేసుకుని చీడపీడల నివారణకు, భూసారం పెరిగేందుకు ఉపయోగిస్తున్నాడు.

జీవామృతంతో ఆరోగ్యంగా పంట

జీవామృతం ఉపయోగిస్తే పంట ఆరోగ్యంగా పెరుగుతుందని వెంకటరెడ్డి దంపతులు చెబుతున్నారు. 5లీటర్ల గోమూత్రం, 10కిలోల పెండ, 2కిలోల పాత బెల్లం, 2 నుంచి 4కిలోల పప్పు ధాన్యాల పిండి, పిడికెడు పుట్టమట్టి, 200లీటర్ల నీటిని కలిపి రెండు రోజుల పాటు మురగబెట్టి తయారు చేసిన కషాయాన్ని నేరుగా ప్రతి 15రోజులకు ఒకసారి పంట మొదళ్లు తడిసేలా చల్లితే ఎటువంటి చీడపడలు ఆశించవని పేర్కొంటున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వలన భూసారం తగ్గి భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని, కావున రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని వెంకటరెడ్డి, కవిత దంపతులు సూచిస్తున్నారు.

ప్రభుత్వం ప్రోత్సహించాలి

నాకున్న నాలుగు ఎకరాల భూమిలో గత 10 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయ పితామహుడు పాలేకర్ స్ఫూర్తితో జీరో బడ్జెట్ విధానంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాము. ఎలాంటి ఖర్చులు లేకుండా వరి, వేరుశనగ, కంది, పెసర, పసుపు పంటలతో పాటు ఇంటి అవసరాలకు వంగ, టమాట, ఆకుకూరలు సాగు చేస్తున్నాను. మాలాంటి చిన్న, సన్నకారు రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తే బాగుంటుంది. ఇంకా గ్రామాల నుంచి రైతులు కూడా ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలి. ప్రతి రైతు కుటుంబం ఆరోగ్యంగా ఉండాలంటే ఒక అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి. – నాగిరెడ్డి వెంకటరెడ్డి, నారాయణపురం


కషాయం తయారు చేస్తున్న వెంకటరెడ్డి, కవిత దంపతులు